సివిల్స్ ఉచిత శిక్షణకు 65 మంది ఎంపిక

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఎ ఆధ్వర్యంలో ప్రాజెక్టు లక్ష్య పేరుతో గిరిజన యువతకు అందిస్తున్న సివిల్స్ ఉచిత శిక్షణకు 65 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేసారు. మంగళవారం ఆయన కార్యాలయంలో సివిల్స్ ఉచిత శిక్షణ ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 156 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించిన ఇంటర్వ్యూకు 150 మంది హాజరయ్యారని చెప్పారు. రెండవ దశ రాత పరీక్ష 100 మార్కులు, ఇంటర్వ్యూ 50 మార్కులకు నిర్వహించామన్నారు. రెండింటికి కలిసి 70 మార్కులు కటాఫ్ మార్కులు పెట్టామని చెప్పారు. 70 మార్కులు సాధించిన అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేసామని చెప్పారు. ఈనెల 1 వ తేదీ నుండి విశాఖపట్నం యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఆరు నుండి తొమ్మిది నెలలు శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ఎటిడబ్ల్యూఓ ఎల్. రజని తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై అంతులేని నిర్లక్ష్యం

మహిళను డోలిలో మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

- ఏళ్ల తరబడి మౌలిక సౌకర్యాలు మృగ్యం
- ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో వెనుకబాటు
- పాలనలో వైసిపి, టిడిపి దొందూ దొందే
- గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కారు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏజెన్సీలో పెరుగుతున్న వ్యతిరేకత

ప్రజాశక్తి - పాడేరు

అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో గిరిజనుల సమగ్రాభివృద్ధి అందని ద్రాక్షగానే మిగిలింది. ఏళ్ల తరబడి గిరిజనులకు రోడ్లు, రవాణా, తాగునీరు, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు మగ్యంగానే ఉన్నాయి. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో గిరిజనులు వెనుకబడే ఉన్నారు. మారుమూల ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగు పడకపోవడం వల్ల చావు బతుకుల మధ్య జీవన మనుగడ సాగిస్తున్నారు. గెడ్డలు, వాగులు దాటి.. కొండలు ఎక్కి డోలిమోతలతో వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లవలసిన పరిస్థితిలో నేటికీ ఉన్నారు. ప్రభుత్వాలు అందించే అరకొర సాయంతో గిరిజనులకు ఆర్థిక పరిపుష్టి కలగడం లేదు. తరాలుగా సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు. గిరిజనులు తమ సమస్యల్ని, డిమాండ్లను పరిష్కరించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర వ్యతిరేకతను నేడు వ్యక్తం చేస్తున్నారు.

కొత్త జిల్లా ఏర్పడినప్పటికీ..

జిల్లా పునర్వ్యవస్థీకరణతో ఆదివాసీల సమగ్రాభివృద్ధి ఆశించినప్పటికీ నిరాశే ఎదురైంది. ఆదివాసీ గ్రామాలాభివృద్ధి అందని ద్రాక్షగా మారింది. రాజకీయ ప్రయోజనాలు తప్ప తమ రక్షణ - సమగ్రాభివృద్ధి వంటి వాటిపై దష్టిపెట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర అసహనానికి గిరిజనులు లోనవుతున్నారు. వాస్తవానికి రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్ళు పూర్తి కావస్తోంది. కేంద్రంలోని బిజెపి విభజన హామీల్లో ఏ ఒక్క దాన్నీ అమలు చేయలేదు. ప్రత్యేక హెూదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, విశాఖ రైల్వేజోన్ వంటి అంశాలన్నింటినీ గాలికి వదిలేసింది. ఇలా రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైంది.

గిరిజన చట్టాలకు తూట్లు

అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి మోడీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టం సవరణ చేసింది. ఎర్రవరం, పెదకోటల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటును అదానీ వంటి కార్పొరేట్లకు అప్పగించింది. ఎస్టీ సబ్ ప్లాన్ చట్టమే లేకుండా చేసింది. విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపింది. కోట్లాదిమంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్ లను తెచ్చింది. రైతులు సాగించిన పోరాటం మీద తీవ్ర దమన కాండను ప్రయోగించింది. విద్య, వైద్యాన్ని ప్రైవేటీకరించడం వల్ల సామాన్యులకు అవి భారంగా మారాయి. మోడీ జపం చేస్తూ జగన్ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో జతకట్టి ముందుకు సాగుతోంది. ఆదివాసీల భవిష్యత్తును పణంగా పెడుతోంది. జిఒ నెంబర్ 3 రిజర్వేషన్ పునరుద్ధరణ చేయాలని. ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ జారీచేయాలని గిరిజన నిరుద్యోగ యువత ఏళ్ల తరబడి వేయికళ్లతో ఎదురుచూస్తోంది. సుప్రీంకోర్టు జిఒ నెంబర్ 3 రిజర్వేషన్ ను పునరుద్ధరణ చేయకుండా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులతో ఉద్యోగాలు భర్తీచేయడం వల్ల సుమారు 2 వేల ఉద్యోగ పోస్టులను స్థానిక ఆదివాసీలు కోల్పోయారు. 1/70 చట్టాన్ని ధిక్కరించి ఆదివాసీల భూములు ఆక్రమణ, మరోపక్క అర్హతలేని బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించడం, నకిలీ గిరిజనులకు ప్రోత్సహించడం వల్ల విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో, భూక్రయ విక్రయాల్లో స్థానిక ఆదివాసులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. వీటిపై అధికార ప్రజాప్రతినిధులు ప్రశ్నించడం లేదు.

ఇబ్బందుల్లో కాఫీ రైతులు

ఏజెన్సీలో కాపీ రైతులు తమకు ప్రోత్సాహక సొమ్ము అందక, తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక పోరాటాలు సాగిస్తున్నారు. పివిటిజి గిరిజనులు తమ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని పోరాడుతున్నారు. అనేక ఆదివాసీ సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటం సాగిస్తోంది. ఇందులో భాగంగానే ఆదివాసీ ప్రజల రక్షణ - సమగ్రాభివృద్ధి పేరుతో నేటి నుంచి అల్లూరి జిల్లాలో వారం రోజులు పాటు సిపిఎం ప్రజా రక్షణ బేరి బస్సు యాత్రకు సిద్ధమైంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు రథ సారథ్యంలో ఈ యాత జరుగుతోంది.

ప్రధాని మోడీ భజనలో జగన్, చంద్రబాబు

మోడీ భజనలో జగన్, చంద్రబాబు ఉన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయం గురించి వీరు పల్లెత్తుమాట అనకపోగా, పార్లమెంట్లో బిజెపిని బలపరుస్తున్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని పోర్టులను అదానీ పరం చేసినా, విద్యుత్ చార్జీలను భారీగా వడ్డిస్తున్నా, ఉద్యోగుల పెన్షన్ కి ఎసరు పెట్టినా నోరువిప్పడం లేదు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో పోరాడితేనే వైసిపి, తెలుగుదేశానికి రాష్ట్రంలో భవిష్యత్తు. అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను మింగేసిన చరిత్ర బిజెపిది. ఇక జనసేన పార్టీ పరిస్థితి మరీ అన్యాయంగా ఉంది. రాష్ట్రానికి ద్రోహం చేసిన, చేస్తున్న బిజెపి కూటమిలో ఉంటూ మోడీ నాయకత్వాన్ని సమర్థిస్తూ మన రాష్ట్రానికి ఏ విధంగా న్యాయం చేయగలుగుతుందో ఆ పార్టీ అధినేత ఆలోచించుకోవాలి. సిపిఎం నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ అసమానతలు లేని అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాష్ట్రంలో తాజాగా ప్రజా రక్షణ భేరి యాత్ర చేస్తోంది. ఈ క్రమంలోనే నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది.

- పి.అప్పలనర్స,
సిపిఎం జిల్లా కార్యదర్శి

నేటి నుంచి జిల్లాలో సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర

- రథసారథులు వి.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు

గిరిజనుల దీర్ఘకాల సమస్యల పరిష్కారానికై పోరాటం సాగిస్తూ, ఆదివాసీల రక్షణ - సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు జిల్లాలో బొడ్డవర జంక్షన్ నుంచి ప్రారంభమవుతుంది. అనంతగిరి మండలంలో రాత్రి వరకూ సాగుతుంది. అల్లూరి జిల్లాలో ఈ బస్సు యాత్ర 12 మండలాల మీదుగా వెళ్తుంది. ఆరు మండల కేంద్రాల్లో సభలు జరుగుతాయి.

నవంబర్ 1న బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు అనంతగిరి మండల కేంద్రంలో బహిరంగ సభ జరుగుతుంది.

2న గురువారం ఉదయం 8 నుంచి 11:30 గంటల వరకు అరకు వ్యాలీలో యాత్ర సాగుతుంది. బహిరంగ సభ ఉంటుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు డుంబ్రిగూడ మండల కేంద్రంలో బహిరంగ సభ జరుగుతుంది. సాయంత్రం నాలుగు గంటలకు ముంచంగిపుట్టు మండల కేంద్రంలో సభ ఉంటుంది.

నవంబర్ 3న ఉదయం 8 గంటలకు పెదబయలు మండల కేంద్రానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు పాడేరు జిల్లా కేంద్రానికి ఈ బస్సు యాత్ర చేరుకుంటుంది. ఇక్కడ బహిరంగ సభ అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు జి.మాడుగుల మండల కేంద్రం మీదుగా సాయంత్రం నాలుగున్నర గంటలకు చింతపల్లి మండల కేంద్రానికి ఈ బస్సు యాత్ర చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం జీకే వీధి మండలం రంపులలో ఈ బస్సు యాత్ర సందర్శించి కాఫీ రైతులను పలకరిస్తుంది. వారి సమస్యలపై అధ్యయనం చేసిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు కొయ్యూరు మండల కేంద్రానికి ఈ బస్సు యాత్ర చేరుకుంటుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు అల్లూరి జిల్లాలోని రంపచోడవరం డివిజన్ లోకి ఈ బస్సు యాత్ర ప్రవేశిస్తుంది. అలా రాజవొమ్మంగి మీదుగా ఏలూరు వైపునకు ఈ బస్సు యాత్ర కొనసాగుతుంది. అల్లూరి జిల్లాలోని మండల కేంద్రాల్లో జరిగే బహిరంగ సభల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపైనా, సమగ్ర అభివద్ధిపైనా సిపిఎం నేతలు ప్రసంగిస్తారు. ఈ యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, కె.సుబ్బరావమ్మ, కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, ఎ.అశోక్, రైతు సంఘం నాయకులు ఎం.సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పాల్గొంటారు.

జయప్రదం చేయాలి: గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ బస్సు యాత్ర ఈనెల 1న అనంతగిరి మండలంలోకి చేరుతుందని సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు, పార్టీ మండల కార్యదర్శి ఎస్. నాగులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ యాత్రను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. బస్సు యాత్ర విజయవంతానికి సిపిఎం మండలంలోని రెండు మూడు బృంధాలుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

పోలవరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్యకు వినతిపత్రం ఇస్తున్న బీసీ కాలనీ వాసులు

బిసి కాలనీని ముంపు జాబితాలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రంలోని బీసీ కాలనీ గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చి నష్టపరిహారం ఇప్పించాలని పోలవరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్యకు ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రవీణ్ ఆదిత్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 250 కుటుంబాలు ఉన్నాయని, తమ గ్రామాన్ని సర్వే అధికారులు సర్వే చేయడం జరిగిందని, పేపర్ ప్రకటన వెంటనే వచ్చేలాగా చూడాలని కోరారు. దీనికి స్పందించిన ప్రవీణ్ ఆదిత్య వారం పది రోజుల్లో పిఎన్ నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన అధికారులకు బీసీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ ప్రజలు వెనకటగిరి నాగార్జున, అలివేలు సరోజిని, రోశయ్య, వెంకన్న, శంకర్, అలజంగి శ్రీనివాస్, సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో గిరిజన గ్రామాలు

- వారం రోజులుగా లేని విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామాలైన వంతమర్రి, గరిమండ, అన్నవరం, కన్నవరం, కునుకూరు తదితర 20 గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చేయలేదని ఆయా గ్రామాలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో కరెంటు లేక నానా అవస్థలు పడుతున్నామని, వెంటనే విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా అడవి పందులను పట్టుకునేందుకు విద్యుత్తు వాడుతుండడంతో కరెంటుకు అంతరాయం జరిగిందని తెలిపారు. ప్రతి లైను క్షుణ్ణంగా పరిశీలించి విద్యుత్తు అంతరాయం లేకుండా చేస్తామని తెలిపారు.

వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సమగ్ర సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని శరభన్నపాలెం, రావణాపల్లి, వెలగలపాలెం గ్రామాల్లో వ్యవసాయ అధికారి ఉమాదేవి ఆధ్వర్యాన పంటల సమగ్ర సస్యరక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పంటల సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. వరి సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎక్కువగా వరిలో ఆకుముడుత తెగులును గుర్తించారు. వాటి నివారణ చర్యలను క్షేత్రస్థాయి సిబ్బందికి వివరించి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా వరి పొలంలో ఆకుముడత విత్తిన 15రోజుల నుండి ఆశిస్తుందని, ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయని, వాటిలోపల ఆకుపచ్చ రంగులో నల్లని తల కలిగిన పిల్ల పురుగులు వుంటాయని తెలిపారు. ఇవి 2, 3 ఆకులను కలిపి వాటిలో వుండి, పత్రహరితాన్ని తినివేయడం వల్ల ఆకులు ఎండి, కాలినట్లు కనపడతాయని చెప్పారు. ఆకు మడతకు సంబంధించి కాట్రాప్ హైడ్రోక్లోరైడ్ 400 మిల్లీలీటర్ ఒక ఎకరాకు ద్రావణాన్ని పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల నుండి తెగులుకు సంబంధించిన మందులను, ఎరువులను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మారేడుమిల్లి మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి కె.ఆదిరెడ్డి సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షుడిగా కె ఆంధ్రయ్య, అధ్యక్షుడిగా డి మహేష్, ప్రధాన కార్యదర్శిగా కె. కృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా సల్మాన్ బాబు, దయమని, కోశాధికారిగా కె.పండయ్య, కార్యదర్శులుగా జి.నిర్మలాదేవి, వి అబ్బాస్, జి త్రినాథ్, వై దుర్గ, వెంకటరెడ్డి, వి రాజారెడ్డి, ఎ.సుబ్బలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్ప మరే విధానాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ జరిగే వరకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు

కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నియంత్రణకు సంబంధిత శాఖలన్నీ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం పర్యావరణ పర్యవేక్షక జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో అటవీ, వైద్య, పంచాయతి రాజ్, గనులు, గ్రామీణ నీటి సరఫరా, కాలుష్య నియంత్రణ, పోలీసు, రవాణా శాఖలు కీలకమన్నారు. కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు ఆయా శాఖలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేక్ హెూల్డర్స్‌తో సమావేశాలు నిర్వహించి గ్రామ, మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, తరచూ సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలని సూచించారు. జిల్లా ఎన్విరాన్మెంటల్ ప్లాన్ సిద్ధం చేసుకుని తద్వారా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో పంచాయతి రాజ్ శాఖ కీలకమని, ఎప్పటి చెత్తను అప్పుడే తొలగించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిర్వహణ, రీ సైక్లింగ్, పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నియంత్రణలపై పాడేరు, రంపచోడవరంలలో వర్క్ షాప్లు నిర్వహించి అవసరమైన శిక్షణలు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో అడవులు ఎక్కువగా ఉన్నందున వాయు, జల, ధ్వని, వాతావరణ కాలుష్యాలు క్రమేపీ తగ్గించాలని కోరారు. లారీ ఓనర్ల సంఘంతో సమావేశమై ధ్వని కాలుష్యం తగ్గించడానికి సూచనలు చేయాలని ఆర్‌టిఓ లీలాప్రసాద్‌ను ఆదేశించారు. ప్రకృతిసిద్ధంగా ప్రవహిస్తున్న వాగులు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆర్‌డబ్ల్యుఎస్ ఇ.ఇ లీలాకృష్ణను ఆదేశించారు. ఇసుక, గనుల తవ్వకాలపై దృష్టి సారించాలని మైన్స్ ఎడి జాన్ ను ఆదేశించారు. పర్యాటక సీజన్ ప్రారంభమైనందున ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పర్యాటక ప్రదేశాలలో వదిలేయకుండా పర్యాటకులకు అవగాహన కల్పించాలన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ భాధ్యత వహించాలని సూచించారు. మెడికల్ వ్యర్థాలను నాలుగు కేటగిరీలలో సేకరించి వాటిని కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల ప్రకారం రీ సైక్లింగ్ చేస్తున్నామని వివరించారు. ఆసుపత్రులు, లేబరేటరీల సిబ్బందికి తగు సూచనలు జారీ చేయాలని డిఎంహెచ్ఓ జామల్ బాషాను ఆదేశించారు. ఆసుపత్రిలో చెత్త తరలించే ట్రాక్టర్ రాక ఆహార వ్యర్థాలు రోజుల తరబడి నిల్వ ఉండటంతో ఇబ్బంది పడుతున్నామని డిసిహెచ్ కృష్ణా రావు కలెక్టర్ దృష్టికి తీసుకెళాలరు.ట్రాక్టర్ కేటాయించాలని డిపిఓ కొండలరావును కలెక్టర్ ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో ఆయా శాఖల అధికారులుపాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని గులేలు పంచాయతీ జంగాంపుట్ గ్రామం నుండి కించురు గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ బోండా. వరహాలమ్మ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు కూడా. బొంజుబాబు, మాజీ ఎంపీపీ సలాంగి. ఉమామహేశ్వరావు, సర్పంచ్ కాతారి. సురేస్ కుమార్, మాజీ జడ్పీటీసీ కొంటా. సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పురస కారి రాములమ్మ, కొంటా. నవీన పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

చంద్రబాబు విడుదలపై సంబరాలు

చింతూరులో బాణసంచా కాల్చుతున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 52 రోజులపాటు రాజమండ్రి జైల్లో ఉన్న చంద్రబాబు మంగళవారం షరతులతో కూడిన బెయిల్‌పై విడుదల కావడంపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.

రంపచోడవరం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు బెయిల్‌పై విడుదల కావడం పట్ల టిడిపి, జనసేన శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. రంపచోడవరం సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు నీ వెంటే మేముంటాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం దేవీపట్నం రోడ్డులోని రామాలయం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు గొర్లె సునీత, అడబాల బాపిరాజు, అనంత మోహన్, సిద్ధ వెంకన్న దొర, చవలం బాపిరాజు, సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లి ఎన్టీఆర్ జంక్షన్‌లో టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి ఆధ్వర్యాన తెలుగు తమ్ముళ్ల టపాసులతో సంబరాలు చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బురక కన్నారావు, వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, పెందుర్తి సుదర్శన్, ముత్యాల సిద్ధు, సవలం రాజేంద్రప్రసాద్, బొర్రా నరేష్, బీరక సూర్య ప్రకాష్ రావు పాల్గొన్నారు.

చింతూరు : మండల కేంద్రంలో తెలుగు తమ్ముళ్లు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక టిడిపి కార్యాలయం నుండి అంబేద్కర్ ఇందిరా, రాజీవ్ సెంటర్ల మీదుగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇళ్ళ చిన్నారెడ్డి, ఓబులనేని రామారావు చౌదరి, రియాజ్, సురేష్ చౌదరి, నరసింహారావు, మల్లెల్లి వెంకటేశ్వరరావు, మంగ వేణి పాల్గొన్నారు.

అడ్డతీగల : చంద్రబాబు విడుదలతో న్యాయమే గెలిచిందని టిడిపి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. చంద్రబాబుకు బెయిల్ రావడంతో టిడిపి పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. అనంతరం దేవి గుడి సెంటర్ వద్ద బాణసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జర్తా వెంకటరమణ, ఎడ్ల శ్రీనివాస్, తీగల ప్రభ, కామన్ కృష్ణమూర్తి, బటాని వరలక్ష్మి పాల్గొన్నారు.

కొయ్యూరు : చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంపై మండలంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఎ.చిరంజీవి, మేడిపోయిన చిన్న తదితరులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. న్యాయం గెలిచింది అంటూ నినాదాలు చేశారు.

డుంబ్రిగుడ : టిడిపి అధినేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించి అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అరకు పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి కే.సుబ్బారావు, టిఎన్‌టియుసి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, మాజీ ఎంపీపీ దాన్నిరావు, భాస్కరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లి : చంద్రబాబునాయుడుకు మధ్యంతర బెయిల్ రావడం న్యాయానికి సంకేతమని ఆ పార్టీ అరకు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తెదేపా, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు బాణాసంచా వెలిగించి, స్వీట్లు పంచారు. పాత బస్టాండు నుండి హనుమాన్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అహంకార పూరిత జగనాసురుడికి రాబోవు సార్వత్రిక ఎన్నికలలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, పెదిరెడ్ల బేతాళుడు, లక్కోజు నాగభూషణం, వీరబాబు పాల్గొన్నారు.

అరకులోయ : చంద్రబాబు నాయుడు బెయిల్ పై విడుదల కావడంతో నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మంగళవారం రాత్రి రోడ్లపైకి తరలివచ్చి సంబరాలు నిర్వహించుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సియ్యారి దొన్నుదొర, పెద్దలబుడు మేజర్ పంచాయతి సర్పంచ్ పెట్టేలి దాసు బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంప్రదాయ దింసా నత్యంతో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగరాజు, చందు, విజయనిర్మల,బీబీ లక్ష్మి, జగన్,త్రినాథ్ తదితరులుపాల్గొన్నారు.

అరకులోయలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

బిర్సా ముండా జయంతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చింతూరు

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ ఉద్యమ నేత బిర్సా ముండా 149వ జయంతి ఈ నెల 11న చింతూరు మండలం, పేగ పంచాయతీలో జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని పేగ గ్రామ కమిటీ పిలుపునిచ్చింది. ప్రతి ఏటా పేగ పంచాయితీలో బిర్సా ముండా జయంతి నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రస్తుత పరిస్థతుల్లో ఆదివాసీలు రాజకీయాలు, ప్రాంతాల పేరుతో విభజనకు గురి కాకూడదని, అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని కోరారు. ఆదివాసీల మూలాలు, హక్కులు, విద్య, పీసా చట్టాలు వంటి వాటి గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ ఏడాది జయంతి వేడుకలకు ఎపిలోని 4 మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలను, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల ప్రజలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీ సాంస్కృతిక నృత్యాలు, పాటలతో ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు.

మిరియాల మార్కెట్ సదుపాయానికి చర్యలు

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీలో మిరియాలకు మార్కెట్ సదుపాయాలు కల్పించడానికి తగిన చర్యలు చేపడతామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేసారు. స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో ప్రామాణిక వాణిజ్య అభివృద్ధి సౌకర్యాల ప్రాజెక్టులో (ఎస్‌టిడి ఎస్) భాగంగా మంగళవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జరిగిన రీజనల్ లోకల్ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిరియాలను కాఫీ మాదిరిగా శుద్ధీకరణ చేసి అదనపు విలువలను జోడించి విక్రయిస్తే రైతులకు మంచి గిట్టుబాటు లభిస్తుందన్నారు. కొనుగోలుదారులకు ఎన్ని టన్నుల మిరియాలు కొనుగోలు చేస్తారో ముందుగా తెలియజేయాలన్నారు. ఆ మేరకు మిరియాలను రైతుల నుండి సేకరించి కొనుగోలుదారులకు వేలం ద్వారా విక్రయిస్తే ఇరువురికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఏజెన్సీలో మిరియాల దిగుబడిపై అంచనాలు సిద్ధం చేయాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు సంచాలకులు ధర్మేంద్ర దాస్, ఆహార, వ్యవసాయ సంస్థ నేషనల్ ప్రాజెక్టు మేనేజర్ వినయ్ సింగ్, సహాయ సంచాలకులు వి.విజీష్ను వర్చువల్ విధానంలోను పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డు అధికారి బి. కళ్యాణి, జిల్లా ఉద్యానవన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు, పి. హెచ్ ఓ ఎన్.అశోక్, కాఫీ బోర్డు ఉప సంచాలకులు రమేష్, ఎపిఎంఐపి , డి ఎం ఎం. ఎ.రహీమ్, జెడ్‌బి ఎన్ ఎఫ్, డిపి ఎం బాస్కరరావు, మోదాపల్లి రైతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-హుకుంపేట: స్వచ్ఛంద సేవ సంస్థలు, సంఘాలు సేవా కార్యక్రమాలలో పాలు పంచుకునేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో వైయస్సార్, టి ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛంద సేవ సంస్థలు సంఘాలు గిరిజన ప్రజల శ్రేయస్సు కోసం సేవలందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఏజెన్సీలో రక్తపు నిలువలు పెంచేందుకు సేవా సంఘాలు, సంస్థలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి తోడ్పాటు అందించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజన ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. వైయస్సార్ టిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తడబరికు సురేష్ కుమార్ మాట్లాడుతూ, రక్త దాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషదాయకంగా ఉందని, తమకు సహకరించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.చారిటబుల్ ట్రస్టు స్థాపించి ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తన భార్య ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ లోహితస్, సభ్యులు సూర్యారావు, డాక్టర్ రూపకళా, టెక్నీషియన్ రాజుబాబు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఆకస్మిక పర్యటన చేశారు. దుంబ్రిగూడ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడి సిబ్బంది విధుల్లో అందుబాటులో ఉన్నారా లేదా అనే దానిపై ఆరా తీసి పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. కార్యాలయంలో అధికారులతో కొంతసేపు సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల పై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషారాణి , తహసిల్దార్ నాగమ్మ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయండి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ఈనెల 2న మండల కేంద్రంలో నిర్వహించే సిపిఎం ప్రజా రక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు మంగళవారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.గురువారం జరిగే ఈ యాత్రకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకుడు టి.సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రజా రక్షణ బేరి బస్సు యాత్ర 3న చింతపల్లి చేరుతుందని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు.అనంతరం చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలే ప్రధాన ఎజెండాగా ఈ బస్సు యాత్ర ఉద్దేశం అన్నారు. గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీకే వీధి, చింతపల్లి మండలాలలో కాఫీ రైతులు అధికంగా ఉన్నారని చింతపల్లి కేంద్రంగా కాఫీ పొడి పరిశ్రమ ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో ఉన్న యువతి యువకులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 3కి చట్టబద్ధత కల్పించాలని కోరారు. 3న మూడు గంటలకు చింతపల్లిలో సభ జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, కార్తీక్, జీవరత్నం పాల్గొన్నారు.

ఆశా వర్కర్లుగా గుర్తించాలి
పిఒకు సిహెచ్‌డబ్ల్యుల వినతి

నినాదాలు చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీలో మారుమూల గ్రామాల్లో సుదీర్ఘకాలం నుంచి ప నిచేస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలను (సిహెచ్‌డబ్ల్యు)లను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని, ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాలని కోరుతూ మంగళవారం ఐటీడీఏ వద్ద ప్రాజెక్టు అధికారి వి అభిషేక్‌కు సిఐటియు ఆధ్వర్యంలో సిహెచ్‌డబ్ల్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందర్రావు మాట్లాడుతూ, గతంలో అధికారులకు ప్రజా ప్రతినిధులకు అనేకమార్లు విన్నవించుకున్నప్పటికీ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌లను ఆశలుగా గుర్తించడానికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. గతంలో అధికారులకు కలిసినప్పుడు కొత్తగా వచ్చిన నోటిఫికేషన్ లో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పి నోటిఫికేషన్‌లో కేవలం 55 ఖాళీ వరకు మాత్రమే చూపించడం జరిగిందన్నారు. 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సుమారుగా 750 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా మారుమూల గ్రామాలలో పని చేస్తున్నారన్నారు. వీళ్లకు సమాన పనికి సమాన వేతన ఇవ్వకపోగా, యూనిఫామ్, సెల్ ఫోన్, తదితర ఇతర రాయితీలు ఇవ్వకపోవడంతో, తమ సొంత ఖర్చుతో సెల్ ఫోను, సొంత ఖర్చుతో యూనిఫామ్ కొనుక్కొని పి హెచ్ సి పరిధిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే నవంబర్ చివరి వారంలో ఐటీడీఏ ముందు దీక్ష చేపడతామని చెప్పారు.ఈకార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ, బేబీ రాణి, కొండమ్మ, రాజీ, సుందరమ్మ, సీత,దలిమ్మ, రాధమ్మ, బీమాలమ్మ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఆల్ ఇండియా అండర్-15, 17 బ్యాడ్మింటన్ పోటీలు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 1 నుండి 8 వ పోటీలు జరగనున్నాయి.ఈ బ్యాడ్మింటన్ టోర్నీ లో అరకువేలి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ స్పోర్ట్స్ పాఠశాల విద్యార్థులు అండర్ -17 విభాగంలో వి అజిత్ కుమార్ 10వ తరగతి, అండర్-15 విభాగంలో కె.ఆదిత్య 10వ తరగతి, పి చంద్రశేఖర్ 9వ తరగతి విద్యార్థులు పాల్గొనున్నట్లు మంగళవారం ప్రిన్సిపల్ పియస్ యన్ మూర్తి, బ్యాడ్మింటన్ కోచ్ రాజుబాబు పత్రిక ప్రకటన తెలియజేశారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

సమావేశమైన యుటిఎఫ్ ప్రతినిధులు

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -అనంతగిరి:మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బివి. శంకరరావు, కార్యదర్శి పి దేముడు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం శివలింగపురం బాలికల పాఠశాల వద్ద సమావేశం నిర్వహించారు. మండల నూతన గౌరవ అధ్యక్షులుగా సిహెచ్ లక్ష్మణరావు, అధ్యక్షులుగా వివి, ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా బిడ్డ, సింహాచలం సహా అధ్యక్షులుగా బిఎస్ఎన్, పడాల్. జి.కనకమహాలక్ష్మి, కోశాధికారిగా విజయకుమార్, కార్యదర్శిగా పి,నాగేశ్వరరావు, డి.సోమశేఖర్. కె పన్నులు, ఎం దయానిధి, కె వివి ఉషారాణి, జిల్లా కౌసలర్లుగా జె.గంగులు, ఎస్.రాంబాబు, పి. దేముడు, వి. భాస్కరరావు, జె.సత్యనారాయణ, పివి. రమణ. అర్జున్, రామకృష్ణ నాయుడు, సిపిఎస్ కమిటీగా జి.నారాయణ కె.సూర్యప్రకాష్. జయదేముడు. ఎస్. లక్ష్మణరావు, మహిళ కమిటీ సభ్యురాలుగా జె.సుధారాణి, కే వివి. ఉసరాణి, బి అరుణ ఎస్.ఈశ్వరమ్మ, శ్యామల ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం స్థానిక మండల ఎంపీపీ బి.ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సకాలంలో సక్రమంగా విధులకు వచ్చి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు కే కరుణ, టి ప్రేమ,వైస్ ఎంపీపీ లలిత, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:జగనన్న సురక్ష పథకం నిరుపేద సామాన్య, నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిస్తుందని ఎమ్మెల్యే పాల్గుణ చెప్పారు. మండలంలోని కిల్లోగుడలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక వైద్య నిపుణులతో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, వైస్ ఎంపీపీ లలిత, ప్రత్యేక వైద్య నిపుణులు ఎన్.విజయ్ కుమార్, వైద్యాధికారులు కే.కరుణ,టి.ప్రేమ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చింతూరు : మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 39వ వర్ధంతి కార్యక్రమం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రం ఇందిరా చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ ఎస్.కె అహ్మద్ అలీ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె.అక్బర్ అలీ బాషా, దాసరి రవికుమార్, బొక్కిలి ప్రసాద్, బొక్కిలి కన్నయ్య, కారం సుబ్బయ్య, కుంజా కన్నారావు పాల్గొన్నారు.

'సాయిగణపతి'లో ప్రాంగణ నియమకాలు
60 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గిడిజాల సాయిగణపతి ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 60 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి. ప్రదీప్ వర్మ, టిపిఒ మల్లికార్జునరావు తెలిపారు.చెన్నైకు చెందిన ఎంఎన్‌సి కంపెనీ కెవైబి. మోటార్సులో మెకానికల్, ఎలక్ట్రికల్, ఇసిఇ విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఎస్. వేణుగోపాల్. విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

బిఆర్‌టిసి పనులు అడ్డగింత

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం తొలి పావంచా నుంచి గోశాల వరకు మిగిలి ఉన్న బిఆర్‌టిఎస్ కారిడార్ పనులను మంగళవారం ప్రొక్లెయినర్‌తో చేపట్టేందుకు సిద్ధమైన జివిఎంసి అధికారులను బాధితులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ పివి. నరసింహం, 98వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు అక్కడకు చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా కార్పొరేటర్ నరసింహం మాట్లాడుతూ,. బిఆర్‌టిఎస్ పనులకు మేము వ్యతిరేకం కాదని, బాధితులకు న్యాయం చేయకుండా పనులు చేపడితే ఎప్పుడైనా అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.

ఉక్కు యోగా సాధకులకు అవార్డులు

ప్రజాశక్తి-ఉక్కునగరం: ఆంధ్ర యూనివర్సిటీ యోగా విలేజ్ వేదికగా నిర్వహించిన ఉత్తరకోస్తా జిల్లాల యోగా పోటీల్లో ఉక్కునగరం కనకారావు గురువు వద్ద శిక్షణ పొందిన 15 మంది పాల్గొనగా 8 మంది విజేతలుగా నిలిచారు.. పిల్లలు, మహిళలు, పురుషులకు విభాగాల వారీగావేర్వేరుగా పోటీలు నిర్వహించగా, ప్రథమ, ద్వితీయ బహుమతులను ఇద్దరేసి గెలుచుకున్నారు.

అక్టోబర్ రేషన్ అందరికీ అందిస్తాం

ప్రజాశక్తి-సీలేరు : అక్టోబర్ నెలలో రేషన్ సరుకులు అందని వినియోగదారులకు నవంబర్ నెలలో రేషన్ సరుకులతో పాటు పూర్తిస్థాయిలో అందజేసే విధంగా చర్యలు చేపడతానని కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ ఇచ్చినట్లు ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో వెల్లడించారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జీకే వీధి మండలం సీలేరులో ఎమ్‌డియు ఆపరేటర్ ప్రసాదు తెల్లకార్డు వినియోగదారులకు ప్రభుత్వం అందజేసిన రేషన్ సరుకులు అక్టోబర్ నెలలో పూర్తిస్థాయిలో సక్రమంగా పంపిణీ చేయలేదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచి దుర్జు, జిసిసి మేనేజర్, ఎండియు ఆపరేటర్ ప్రసాదుతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి అక్టోబర్ నెలలో రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో ఎందుకు అందజేయలేదని కలెక్టర్ ప్రశ్నించినట్లు చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సోమవారానికి దీనికి సంబంధించిన పూర్తి సారాంశాన్ని వెల్లడిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.


కలెక్టర్ ఫిర్యాదు చేసిన ప్రజాప్రతినిధులు

నౌకాదళంలో మహిళలకు మంచి అవకాశాలు

కస్తూర్బా విద్యార్థినులతో సజీవకుమార్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏ రంగంలోనైనా అవకాశాలు అందిపుచ్చుకోవడంలో మహిళలే ముందంజలో ఉన్నారని నౌకాదళ అధికారి సజీవకుమార్ అన్నారు. మంగళవారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి స్థానిక కెజిబివిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నావికాదళంలో మహిళలకు మంచి అవకాశాలు ఉన్నట్లు వివరించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు బడ్జెట్‌లో మంచి కేటాయింపులు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి అండర్ -14 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. జిసిడిఓ ఖలీషా బేగం, కస్తూర్బా ప్రిన్సిపల్ గంగాకుమారి పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌కు 'అపోలో'లో అధునాతన వైద్యం

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలో ఆసుపత్రి కేన్సర్ వైద్యకేంద్రంలో రొమ్ము కేన్సర్‌ను 24 గంటల వ్యవధిలోనే కచ్చితమైన వ్యాధి నిర్ధారణ చేసే అరుదైన, అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చింది. రొమ్ము కేన్సర్ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆరిలోవ అపోలో ఆసుపత్రి సమావేశ మందిరంలో రొమ్ము కేన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో అపోలో కేన్సర్ వైద్య విభాగం, మెడికల్ అండ్ హెమట్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రాకేష్‌రెడ్డి బోయ, రేడియేషన్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సుమన్‌దాస్, సర్జికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎంపిఎస్ చంద్రకల్యాణ్ అపోలోలో అందుబాటులో ఉన్న ఆధునిక కేన్సర్ విధానంపై వివరాలు వెల్లడించారు. రొమ్ము కేన్సర్‌పై అవగాహన, ఆధునిక వైద్యవిధానం ద్వారా రోగికి కలిగే ప్రయోజనాలను వివరించారు.
ఈ ఆధునిక వైద్యవిధానం ద్వారా కేన్సర్‌ను 24 గంటల్లోనే కచ్చితంగా అంచనా వేయడానికి మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, బయాప్సితో సహా అధునాతన డయాగ్నస్టిక్ టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తించడం ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందించి ఎక్కువ శాతం మందిని ప్రాణపాయస్థితి నుండి సులభతరంగా రక్షించడంతోపాటు, రోగుల్లో ఆందోళన తగ్గించవచ్చన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న అపోలో ఆంకాలజిస్ట్‌ల బృందం

3న చలో ఐటిడిఎ

ప్రజాశక్తి -హుకుంపేట:అంత్యోదయ కార్డుల కోసం పోరాటానికి కదిలి రావాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కిల్లో రామారావు పిలుపునిచ్చారు. పీవీటీజీ అంత్యోదయ కార్డుల కోసం ఈనేల 3న చలో ఐటీడీఏకు పీవీటీజీ గిరిజనులు కదిలి రావాలని ఆయన అన్నారు. పీవీటీజీ గిరిజనులకు కార్డులు ఇవ్వాలని ఐటీడీఏ వద్ద పీవీటీజీ గిరిజనులు, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఐటీడీఏ ఏపీఓ అక్టోబర్ నెల కల్లా అంత్యోదయా కార్డులు ఇస్తామని హామీ ఇచ్చి మరిచి పోయారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం పీవీటీజీ గిరిజన నాయకులు కిల్లో అప్పల రాజు, సీదరి అప్పారావు, మర్రి సుబ్బారావు, మర్రి సంజీవ్, పాంగి సూరి బాబు తదితరులు పాల్గొన్నారు

సిపిఎం కార్యకర్త రామ్మూర్తి మృతి

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని సున్నవారి గూడెం గ్రామంలో సిపిఎం కార్యకర్త సోయం రామ్మూర్తి (50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు రామ్మూర్తి మృతదేహంపై ఎర్రజండా కప్పి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సోయం చిన్నబాబు మాట్లాడుతూ రామ్మూర్తి నిత్యం పార్టీకి, ప్రజలకు దగ్గరుండి సేవ చేసేవాడని పార్టీలో మంచి సేవకున్ని కోల్పోయామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సున్నం నాగమ్మ, సిపిఎం నాయకులు సున్నం రంగమ్మ, అచ్యుతరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తికి జోహార్లర్పిస్తున్న సిపిఎం నేతలు

అడవి పందుల వేటగాళ్లపై చర్యలు

ప్రజాశక్తి - చింతపల్లి: అడవి పందుల వేటతో విద్యుత్ సరఫరాకు విఘాతం కలుగుతుందని వాటిని నియంత్రించేందుకు వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ లొంజా మహేంద్ర నాథ్ అన్నారు. మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాల గ్రామాలకు చింతపల్లి సబ్ స్టేషన్ నుండి పెదవలస 11 కే వి ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. ఆ ఫీడర్లో ఏర్పడిన సాంకేతిక లోపంతో బూద రాళ్ళ పంచాయతీలోనే గాక మన్యంలోని వివిధ గ్రామాలలో విద్యుత్‌కు విఘాతం కలుగుతుందన్నారు. ఇటువంటి అంతరాయాలను జి.కే వీధి మండలంలో సురవరం, పెదజడుమూరు గ్రామాలలో ఉన్న కొండ ప్రాంతంలో వెళుతున్న 11 కెవి (విద్యుత్ లైన్)పై అడవి పందులను వేటాడటం కోసం వేటగాళ్లు జీఏ వైర్లను ఎలక్ట్రికల్ లైన్ గుండా దొంగతనంగా అమర్చుతున్నారన్నారు. వీటితో తరచుగా విద్యుత్ కు అంతరాయం ఏర్పడుతుందని గుర్తించడం జరిగిందన్నారు. ఈ అంతరాయాలను అధిగమించడం కోసం తమ సిబ్బంది నిరంతరం లైన్ పెట్రోలింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఎలక్ట్రికల్ వైర్ల ద్వారా వేటాడే విషయాన్ని జీ.కే. వీధి పోలీస్ లకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

పటేల్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-పాడేరు : భారత రత్న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి వేడుకలను ఐటిడిఏ లో ఘనంగా నిర్వహించారు. వల్లభ్ భాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాల వేసి ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ మంగళవారం నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు పాల్గొన్నారు.
రంపచోడవరం :వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం మంగళవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణం నుండి నిర్వహించిన 3కె రన్ కార్యక్రమాన్ని ఎంపీపీ బంధం శ్రీదేవి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఏపీవో జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, జెడ్పిటిసి పండా వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ యం.బొజ్జయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్. పిహెచ్‌ఓ చిట్టిబాబు, తహశీల్దారు పివివి.జయకుమార్, ఎంపీడీవో హరికృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో ఎంఎస్‌ఎంఇ మల్టీ యుటిలిటీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు పరిశ్రమల శాఖ కమిషనర్ సిహెచ్.రాజేశ్వరరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆటోనగర్ వాసవలో జరిగిన వాసవ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, మల్టీ ట్రేడ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, వెండర్ డెవలప్‌మెంట ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఇండస్ట్రీస్ నిర్మాణం చేస్తామన్నారు.